క్లుప్తంగా

రుణాల రికవరీలో నిర్లక్ష్యం తగదు



వీఓఏలకు అవగాహన కల్పిస్తున్న ఏరియా కోఆర్డినేటర్

ఉయ్యాలవాడ: స్వయం సహాయక సంఘం పొదుపు సభ్యులు రుణాల రికవరీలో నిర్లక్ష్యం చేయడం తగదని వైఎస్ఆర్ కాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ గురుస్వామి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పొదుపు మహిళలు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. మహిళలను ఆర్థికంగా ఎదుగుదల కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. వీఓఏలు క్షేత్రస్థాయిలో పొదుపు సభ్యులతో సమావేశాలు నిర్వహించి బ్యాంకుల రుణాలు, శ్రీనిధి రుణాలు చెల్లించేలా చూడాలన్నారు.

ఆలయాలకు పెరిగిన ఆదాయం



యర్రగుంట్లలో వేలం పాటలను నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: మండలంలోని బోయలకుంట్ల శ్రీ రామేశ్వరస్వామి, అనంత పద్మస్వామి, వేణు గోపాల స్వామి, ఆంజనేయస్వామి, నరసింహ్మస్వామి ఆలయాలకు చెందిన 66 ఎకరాల మాన్యం భూముల కౌలు బహిరంగ వేలం పాటలను బుధవారం అధికారులు నిర్వహించారు. గతేడాది రూ.6.44 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.9.67 లక్షలు సమకూరింది. అలాగే యర్రగుంట్ల శ్రీ రామస్వామి, ఈశ్వరస్వామి ఆలయాల మాన్యం భూముల కౌలు వేలం పాటల్లో రూ.9.70 లక్షలు ఆదాయం సమకూరింది. కార్యక్రమాలల్లో ఈఓలు వేణు నాథరెడ్డి, నరసయ్య, చైర్మన్లు జింకల నారాయణ, మేరుగ జయనాగిరెడ్డి, సర్పంచు జింకల నాగన్న పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించండి



పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

రుద్రవరం: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని రుద్రవర రేంజి అధికారి శ్రీపతినాయుడు సూచించారు. ముత్తలూరులో బుధవారం రుద్రవరం రేంజి నూతల సెక్షన్ అధికారులు పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5 వరకు గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు కొనసాగిస్తామన్నారు. ఇందులో భాగంగా ఇంటికో మొక్క నాటాలని, నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, నాగేంద్రయ్య, ఎంపీటీసీ నంద్యాల విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): అరకొర వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, గౌస్‌లు కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలను మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పథకం నిర్వాహకులు శకుంతల, మేరి, పుష్పావతి, మార్తమ్మ, మహమ్మద్‌బీ, గ్రేసమ్మ, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జగనన్న కాలనీల్లో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారంనిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో గూడులేని పేదలను గుర్తించి స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు సురేష్, హబీబ్‌బేగ్, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

ఓ వైపు భానుడి భగభగలు.. మరో వైపు వీచే వడగాలులు .. ఇలా సూర్యభగవానుడు ఒక్కసారిగా భగ్గుమంటూ నిప్పుల వర్షం కురిపిస్తుండటంతో ప్రజలు హడలి పోతున్నారు. వారం రోజులుగా 38 నుంచి 41 డిగ్రీల వరకు ఉన్న ఉష్ణోగ్రతలు బుధవారం మరింత ఉగ్రరూపం దాల్చడంతో 44 డిగ్రీల సెంటీగ్రేడ్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడిమి తాళలేక ఉదయం 10 గంటలు దాటితే పనులమీద బయటకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు. పట్టణాలు, పల్లెల్లో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసరమైతే తప్ప గుమ్మం దాటి బయటకు వచ్చే సాహసం చేయలేక పోతున్నారు.

- 44 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- అగ్నిగుండంలా వాతావరణం
- వేడి గాలులతో జనం బెంబేలు
- ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా రహదారులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

ఆళ్లగడ్డ: ఈ నెల 11 నుంచి కృత్తిక కార్తె ప్రారంభమైంది. అప్పటి నుంచి ఉష్ణోగ్రతల్లో గణనీయంగా పెరుగుదల నమోదవుతూనే ఉంది. అప్పుడప్పుడూ సాయంత్రం వేళల్లో వర్షపు జల్లులు పడుతున్నా పగటి ఉష్ణోగ్రతలు ఏమాత్రం తగ్గడంలేదు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఈ నెల 25 నుంచి రోహిని కార్తె మొదలవనుంది. రోహినిలో ఆరుబయట ఉన్న రోళ్లు పగులుతాయన్న సామెత ఉంది. దీంతో రోహినిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం బెంబేలెత్తుతున్నారు.

6 డిగ్రీలు అధికం

ప్రస్తుతం సాధారణం కంటే 5 నుంచి 6 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటుండంటంతో బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. గత వేసవిలో మే మాసంలో చివరి వరకు అప్పుడప్పుడూ 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి నుంచే 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కొద్ది రోజుల క్రితం పగలు ఎండ పెట్టినా సాయంత్రం, రాత్రి సమయంలో అక్కడక్కడా చిరుజల్లులు పడుతుండటంతో వాతావరణం కాస్త చల్లగా ఉండేది. ప్రస్తుతం రాత్రి వేళల్లో సైతం ఉక్కపోత భరించలేనంతగా ఉంటోంది. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు, చంటి పిల్లలకు ఫ్యాన్లు, కూలర్లు పెట్టినా ఉపశమనం కలగడంలేదు.



నిర్మానుష్యంగా ఆళ్లగడ్డ ప్రధాన వీధి



ముఖానికి గుడ్డలు కట్టుకుని వెళ్తున్న దృశ్యం

తగ్గిన వ్యాపారాలు

నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు బయటకు రావాలంటే మొహానికి ముసుగులు ధరించుకోవాల్సి వస్తోంది. లేకుంటే వడదెబ్బకు గురై ఆసుపత్రి పాలవ్వాల్సి వస్తోంది. ఎండల ప్రభావం పెద్ద, చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. చెట్ల కింద, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లి సాయంత్రం చల్లబడిన తర్వాత వస్తున్నారు. మరో పక్క వడదెబ్బకు లోనవుతూ వందల సంఖ్యలో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

వారం రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)

తేది	గరిష్ట	కనిష్ట
17	44.0	30
16	42.2	27.5
15	41.6	27.6
14	42.0	26.5
13	39.6	26.9
12	38.0	25.7
11	42.6	23.8

బయటకు పోవాలంటే భయమవుతోంది



నేను బోరింగ్ రిపేర్‌లు, మంచినీటి పైపులైన్ల కాంట్రాక్ట్ పనులు చేస్తాను. నా కింద కనీసం రోజు 50 మంది కూలీలు పనిచేస్తున్నారు. ఎండా కాలంలోనే మాకు పనులు ఎక్కువగా ఉంటాయి. అయితే ఉదయం 10 గంటలు దాటితే బయటకు పోలేకపోతున్నాం. పైపులు కూడా ఎండకు వేడెక్కి ఉంటాయి. పట్టుకుంటే చేతులు బొబ్బలు వస్తున్నాయి. ఎండ వేడికి బయటకు పోవాలంటే భయమేస్తోంది. అత్యవసర పనులైతే తెల్లవారుజామున, రాత్రి సమయంలో చేస్తున్నాం.

– నజీర్, కాంట్రాక్టర్

నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బ



ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వీలైనంత వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం చల్లబడే వరకు బయట తిరక్కుండా ఉంటే మంచిది. విధిలేని పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు కచ్చితంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా వదులైన కాటన్ దుస్తులను ధరించాలి. లవణాలతో కూడిన నీటిని అధికంగా తీసుకుంటూ ఉండాలి. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. ప్రతి అరగంటకు అర లీటరు నీరు తాగడం మంచిది. వడ దెబ్బకు గురైన వ్యక్తిని చల్లటి గుడ్డతో తుడుస్తూ వీలైనంత త్వరగా దగ్గరలోని వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి.

– డాక్టర్ నాగేశ్వరరాజు, జనరల్ సర్జన్, ఆళ్లగడ్డ

23న శిరివెళ్లలో మినీ జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): శిరివెళ్ల మండలం యర్రగుంట్లలోని జీటీఆర్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 23న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, సుజల పైప్స్, నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టు తదితర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యే జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9701303790, 9440224291 నంబర్లను సంప్రదించాలన్నారు.

మురుగు కాల్వలో చెత్త వేస్తే చర్యలు తప్పవు

- మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలోని మురుగు కాల్వల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక పద్మావతి నగర్, రామనాథ్‌రెడ్డి నగర్, టెక్కే ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలతో శానిటేషన్ సిబ్బంది వచ్చినప్పుడు వారికి చెత్తను అందివ్వాలని, అలాకాకుండా మురుగు కాల్వల్లో వేస్తే జరిమానా విధిస్తామని స్థానికులను హెచ్చరించారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కమిషనర్ వెంట డీఈఈ మధుకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పథకాల లబ్ధినిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

శిరివెళ్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఒకటో సచివాలయ పరిధిలో పర్యటించారు. బలిజపేట, సాలాదిపేట, మంగళిపేటలలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సేవల లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్ అందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన ప్రజల ముంగిటకే వచ్చిందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా వలంటీర్ల ద్వారా పథకాలు ఇంటికే చేరుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిపేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, హిస్టరీ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ హఫీజ్, దేవస్థానం చైర్మన్ తిమ్మరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

శిరివెళ్ల: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ నాయక్ వసీం అధికారులకు సూచించారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ నిధులను వినియోగించి మంచినీటి బోర్లు, పైప్‌లైన్, చేతి పంపులకు మరమ్మతులు చేయించాలన్నారు. శిరివెళ్ల, గోవిందపల్లె నీటి కుంటలను నీటితో నింపామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీసియన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం అధికారులు తమ శాఖల పనితీరు, పురోగతిని వివరించారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ దిల్షాద్ బేగం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఎంపీడీఓ సుబ్రమణ్యం, ఏఓ సుధాకర్, పీఆర్ ఏఈ రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నాయక్ వసీం

నవరత్నాలతో ఇంటింటికీ వెలుగులు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



మహిళలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల: నవరత్నాలతో ప్రతి ఇంటిలనూ వెలుగులు నిండాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం పట్టణంలోని 2వ వార్డులో పర్యటించారు. కౌన్సిలర్ సాదిక్ బాషాతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులం, మతం, పార్టీలు చూడకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన సేవలు అందుతున్నాయన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు సమ్మద్, తమీమ్, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్, రహంతుల్లా, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

అఖిల ఆరోపణలు హాస్యాస్పదం



వీడియోలో మాట్లాడుతున్న ఏవీ జశ్వంతి

బొమ్మలసత్రం:యువగళం పాదయాత్రలో వేలాది మంది కార్యకర్తల మధ్య తండ్రి లాంటి పెద్దమనిషి ఏవీ సుబ్బారెడ్డి బిడ్డ వయస్సున్న అఖిలప్రియపై అత్యాచారం చేసే అవకాశం ఉంటుందా అని ఏవీ సుబ్బారెడ్డి కుమార్తె ఏవీ జశ్వంతి ప్రశ్నించారు. తన తండ్రిపై జరిగిన హత్యాయత్నం ఘటనపై బుధవారం ఆమె అమెరికా నుంచి ఓ వీడి యో విడుదల చేశారు. అఖిలప్రియ తనను ఏవీ సుబ్బారెడ్డి చున్నీ లాగాడని ఫిర్యాదు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలోనూ ఆమె సైకిల్ యాత్రలో భాగంగా ఏవీ సుబ్బారెడ్డిపై దాడికి యత్నించిందన్నారు. 65 ఏళ్ల వయస్సున్న తన తండ్రి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పోలీసులు సరైన సమయంలో స్పందించడంతో తన తండ్రి క్షేమంగా ఉన్నారని, వాళ్లకు రుణపడి ఉంటామని చెప్పారు.

ముగిసిన ప్రతిష్టోత్సవాలు



రెడ్డిపల్లెలో ధ్వజ స్తంభం ప్రతిష్టిస్తున్న దృశ్యం



బండ లాగుతున్న వృషభాలు

రుద్రవరం: మండల పరిధిలోని రెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో చేపట్టిన ప్రతిష్టోత్సవాలు ముగిశాయి. పండితులు మూడు రోజుల పాటు విశేష పూజలు, హోమాలు చేశారు. చివరిరోజు బుధవారం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తుల మధ్య అభయాంజనేయ స్వామి యంత్ర ప్రతిష్ట, ధ్వజ ప్రతిష్ట, కలశ ప్రతిష్ట, మూర్తి ప్రతిష్ట అనంతరం ప్రాణ ప్రతిష్ట, కళాన్యాసం, నేత్రోన్మలనం, కాష్టాగ్ని జ్వాల, గోదర్శనం, బలి ప్రదానం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్టోత్సవాల సందర్భంగా గ్రామ పెద్దలు ఎద్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి 11 జతల ఎద్లు పోటీలో తలపడ్డాయి. విజేతల ఎద్ల యజమానులకు మొదటి, రెండవ, మూడవ, నాల్గవ బహుమతుల కింద రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5,116లు అందజేశారు.

ముగిసిన చండీహోమం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోట వీధిలోని సుంకులా పరమేశ్వర దేవి ఆలయంలో మూడు రోజులుగా సాగుతున్న చండీహోమం బుధవారంతో ముగిసింది. చివరి రోజు పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: వేసవిలో తాగునీటి సమస్య రానివ్వొద్దని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ తదితర పనుల ప్రగతిపై ఆయా శాకల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మరమ్మతులకు గురైన 49 బోర్లకు వారం రోజుల్లో రిపేర్లు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జల జీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న 51 పనులను వెంటనే ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ నిమిత్తం టెండర్లను పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 116 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు గురైన 1766 సోక్ పిట్లను మూడు రోజుల్లో పునరుద్ధరించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రోజువారి లేబర్ రిపోర్టింగ్ శాతాన్ని పెంచాలన్నారు. సన్న, చిన్నకారు రైతులకు 5వేల హెక్టార్లలో వివిధ రకాల పండ్ల ఉత్పత్తులకు ఉపాధి హామీ కింద చేపట్టాలన్నారు. అమృత్ సరోవర్ కింద చెరువుల పునరుద్ధరణ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ, ఏపీడీలకు సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద పెండింగ్‌లో ఉన్న 152 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలన్నారు. కుక్కలు, కోతులు, పందులు తదితర మూగజీవాలను సరిహద్దు ప్రాంతాల్లోని సురక్షిత ప్రదేశాల్లో వదిలేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీపీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు పూర్తి చేయండి

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నాడు–నేడు పనుల ప్రగతిపై జేసీ కలెక్టర్ నిశాంతితో కలిసి కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పనుల్లో కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, సంజామల, బనగానపల్లె, శ్రీశైలం, రుద్రవరం మండలాల్లో ప్రగతి అధ్వానంగా ఉందని, వారంలో పురుగతి కనిపంచాలన్నారు. జూలైలో నిర్వహించే ఇంటర్, 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు పాసయ్యేలా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో డీఈఓ అనురాధ, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, సంక్షేమ శాఖ డీడీ చింతామణి పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయండి

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందజేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు నకిలీ విత్తనాలు, ఎరువుల బారిన పడకుండా విత్తన, ఎరువు విక్రయ దుకాణాలపై దాడులు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో జేసీ నిశాంతి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ నాగరాజు

ఉయ్యాలవాడ: జగనన్న కాలనీల గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించేందుకు సమన్వయంతో పని చేయాలని హౌసింగ్ ఏఈ నాగరాజు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావులు సూచించారు. బుధవారం స్థానిక సచివాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. స్టీలు, సిమెంట్, కంకర, ఇసుక, తదితర సామగ్రి ప్రభుత్వం అందిస్తుందని చెప్పి లబ్ధిదారులను నిర్మాణాలు ప్రారంభించేలా ఒప్పించాలని హౌసింగ్ కమిటీ సభ్యులకు సూచించారు. ఆర్.పాంపల్లె జగనన్న లేఅవుట్‌లో 43, ఇంజేడు 55, సర్వాయిపల్లె 43, ఉయ్యాలవాడ 127 గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఆయా సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు కావలసిన నీరు, విద్యుత్, తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు

ఉయ్యాలవాడ:ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు.బుధవారం ఆయన తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలానికి 75 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. 5 ఎకరాల్లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులు మామిడి, చీనీ, జామ, నిమ్మ, సపోటా, దానిమ్మ, కొబ్బరి, సీతాఫలం, అల్ల నేరేడు, చింత, డ్రాగన్ ఫ్రూట్స్, గులాబీ, మల్లె పువ్వులు సాగు చేసుకునేందుకు వంద శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఎకరాకు రూ.90 వేల నుంచి రూ.1.10 లక్షల వరకు సాగు నిర్వహణ నిమిత్తం మూడేళ్ల పాటు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఉపాధి కోర్స్ డైరెక్టర్ పరమేశ్వరుడు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.